

**శర్మ** వృత్తిరీత్యా ప్రభుత్వ రోడ్ రవాణా సంస్థలో లీవ్ సెక్షన్‌లో హెడ్‌క్లర్క్. అపర చాణక్యుడు, చిక్కడు-దొరకడు మొదలైన బిరుదులున్నాయ్. చెన్నపట్నంలో బోలెడు పరపతి వుంది. ఉద్యోగంతో పాటు బోలెడు ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ కూడా వున్నయ్. ఉదాహరణకు తెల్సిన మొహం కన్పిస్తేచాలు... ఇన్సూరెన్స్ పాలసీ

# చేదు నిజం

బండా శ్రీనివాసరావు

మొదటి
కథ

తీసుకునేదాకా జిడ్డులా వదిలేవాడు కాదు. ఫ్రెండ్స్ ఆముదం, కేస్టరాయిల్ అంటారు. ఎవ రైనా ఉద్యోగి పాతికో పరకో సమర్పిస్తే లీవ్ అప్లికేషన్ లీవ్ రికార్డ్‌లో డెబిట్ చేయకుండా యఫ్ డిస్పోజల్ చేసేవాడు. ఆఫీస్ పరిభాషలో యఫ్ డిస్పోజల్ అంటే ఫైర్ డిస్పోజల్. తెలుగు లో చెప్పాలంటే వచ్చిన కాగితానికి అగ్గిపుల్ల గీచి అంటించడం.

అతని ప్లస్, మైనస్ పాయింట్లు ఏమైతేనేం? నాకు ఒక విషయంలో సహాయపడ్డాడనే చెప్పా లి! శర్మా... నాకీ వూరు కొత్త. తమిళ్ తెలియ దు. ఎక్కడైనా నీ పరపతి ఉపయోగించి నాకు కాస్త షెల్టర్ యిప్పించకూడదూ? అన్నా.

'మాది మూడు గదుల ఇల్లు. ఒక గది మీ కిచ్చి... రెండు గదుల్లో ఎడ్జస్టయ్ పోతాం. వాట్ యీజ్ దేర్? పరోపకారార్థం యిదం శరీరం అన్నారు పెద్దలు.'

'నువ్వు యిస్తానంటే నేవద్దంటానా?' అని పాడుకుంటూ వాళ్ల యింట్లో చేరాను.

శర్మ భార్య నన్ను 'అన్నయ్యగారూ' అని పిలిచేది. ఇంట్లో ఏమైనా పిండి వంటలు చేసు కుంటే 'అంకుల్'కి యిచ్చిరామ్మా అని వాళ్ల అమ్మాయి చేత పంపించేది.

ఒకసారి శర్మ నా గదిలోకి వచ్చి 'గురూగా రూ! నా టార్గెట్ పూర్తికాలా. బిజినెస్ ఓ లక్ష రూపాయలు డెఫిసిట్‌లో వుంది. మీరే సర్దుబా టు చేయాలి' అన్నాడు.

వాళ్ల 'ఉప్పు' తిన్న విశ్వాసానికి కాదనలేకపో యాను. నాకు చెప్పినట్లే చెప్పి, ఆఫీసు కొచ్చిన ఎ.జి. ఆడిట్ పార్టీ వాళ్ల దగ్గర్నుంచి కూడా పాలసీలు పట్టాడని విన్నా.

* * *

శర్మ, నేనూ తంజావూరులో చారిత్రక కట్ట డాలు చూసి, సైట్ సీయింగ్ ముగించుకుని తిరి గొస్తున్నాం. నేను పై బెర్త్‌పై వున్నాను. కింద బెర్త్‌లో వున్న శర్మ ఎవరితోనో మాట్లాడుతు న్నాడు.

'బాబూ? ఎందాకా ప్రయాణం?'

'మద్రాసండి'

'మనిద్దరి గమ్యస్థానం ఒకటేనన్నమాట. మీది అసలే వూరు బాబూ?'

'తెనాలి'

'నీదీ తెనాలే, నాదీ తెనాలే'. భలే కోయిన్సి డెన్సు.

'నాన్నగారు ఏంచేస్తుంటారు?'

'కలెక్టర్'

'ఐసీ... మద్రాస్ ఏం పనిమీద వస్తున్నావు నాయనా?'

'నెల రోజుల ట్రైనింగ్ వుంది'

'ఏం చదివావేమిటి?'

'బి.టెక్.'

'ఏం ఉద్యోగం?'

'సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. క్యాంపస్ సెలెక్షన్'

'మద్రాస్‌లో ఎక్కడుంటావ్?'


'ఇంకా డిసైడ్ చేసుకోలేదు. ఏవైనా మాడరే ట్ టారిఫ్ హొటల్స్ వున్నాయేమో ట్రైచేయాలి.'

'అబ్బాయ్! నీకభ్యంతరం లేకపోతే పేయిం గ్ గెస్ట్‌గా మా ఇంట్లో వుండొచ్చు. నీకు ఊరు కొత్త, భాష కొత్త. ఇక్కడ తెలుగు వచ్చినా మాట్లా డరు. బెస్ట్ థింగ్ మా ఇంటికొచ్చేసెయ్. ఎనీ సెకండ్ థాట్?'

ఆ అబ్బాయి మరి ఆలోచించకుండా శర్మ ఇంట్లో దిగాడు సూట్‌కేస్‌తో.

* * *

అచిరకాలంలోనే ఆ అబ్బాయి ఆత్మబంధు




వులా అందరితో కలిసిపోయాడు. తెలియని వాళ్లెవరైనా 'ఆ అబ్బాయ్ ఎవరండీ మీ బంధువా' అని ప్రశ్నిస్తే ముక్తసరిగా 'లాంటివాడే' అని బదులిచ్చేవాడు శర్మ.

నేను ముఖ్యుడైన వాణ్ణి కనక నాతో మాత్రం 'వుడ్ బి సన్ యిన్లా' అని చెప్పాడు. 'అయితే నా బోంట్లకు మృష్టాన్న భోజనం దొరికేరోజు దగ్గరలో వున్నదన్న మాట' అన్నా.

తొందర పడకు. లైన్లో పెడుతున్నా... అన్నాడు ధీమాగా.

* * *

నెల అనుకున్నది మూడు నెలలు గిర్రున తిరిగినయ్. సాయంత్రం ఆరింటికల్లా టంచన్‌గా వచ్చే కుర్రాడు ఆరోజు ఎందుకో రాలేదు. విడిపోతున్న సందర్భంలో ఫ్రెండ్స్‌తో సెకండ్‌షో సిన్మాకో, పబ్‌కో వెళ్ళుంటాడనుకున్నాం. కానీ అతని సూట్‌కేస్ జాడ కూడా లేదు. శర్మకు పరేషాన్ అయింది. శర్మ భార్యకు కళ్లనీళ్ల పర్యంతం అయింది. మెల్లగా శర్మ చెవిలో ఏదో ఊదింది. శర్మ 'షాక్' తిన్నవాడిలా నిశ్చేష్టుడై పోయాడు. 'ఓరి అప్రాచ్యుడా. మూడు నెలలు ఇంటల్లుడిలా మెక్కి నా కూతురు 'నెల' తప్పేట్లు చేస్తావా?' ఆగ్రహంతో వూగిపోయాడు శర్మ.

దరిమిలా తెల్సిందేమిటంటే... ఆ అబ్బాయి 'సత్యం' కంప్యూటర్స్‌లో పన్జేస్తున్నట్లు 'అసత్యం' చెప్పాడని, వాళ్ల నాన్న జిల్లా కలెక్టర్ కాదు, బిల్ కలెక్టరనీ...

* * *

ఇది జరిగిన కొన్నాళ్లకు తెలిసింది... ఆ అబ్బాయి లక్షణంగా వాళ్ల మేనమామ కూతుర్ని పెళ్లి చేసుకుని పిఠాపురంలో కాపురం పెట్టాడని.

* * *

ఇతరులకు టోపీ వెయ్యడమే కానీ తనెప్పుడూ టోపీ పెట్టించుకోని శర్మ ఎట్లా బోల్తాపడ్డాడా అనేది నన్ను యిప్పటికీ వేధిస్తున్న ప్రశ్న. ప్చ్... అంతా శర్మ ఖర్మ. ●